క్లుప్తంగా

నాలుగో రోజు రూ.21వేల జరిమానా



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని వివిధ దుకాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తనిఖీ చేసి నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు తదితరాలను మొత్తం 203 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. న్యూటౌన్, రాజేంద్రనగర్, మెట్టుగడ్డ, పద్మావతికాలనీలలో 148 షాపులపై దాడులు నిర్వహించారు. ఇందులో సుమారు పది దుకాణ యజమానులకు రూ.21 వేలు జరిమానా విధించారు. న్యూటౌన్ ప్రాంతంలోని హష్మీ బ్రదర్స్ షాపు నుంచి 120 మైక్రాన్ లోపు మందం కలిగిన 183 కిలోల ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసి రూ.15వేలు జరిమానా వసూలు చేయడం గమనార్హం. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ ప్రారంభోత్సవం

నవాబుపేట: మండలంలోని కూచూర్ గ్రామంలో బుధవారం నుంచి మూడు రోజులు నూతన హనుమాన్ దేవాలయం ప్రారంభంతో పాటు ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, గ్రామదేవతలు, బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బోజయ్య, రవి, సంజీవరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, నర్సింహులు, వెంకటయ్య తెలిపారు. బుధవారం యజ్ఞప్రతిష్ఠ, అగ్నిస్థాపన, గురువారం దేవతామూర్తుల జల, ధన్యాది వాసం, శుక్రవారం యంత్ర ప్రతిష్ఠ, దేవతా మూర్తుల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.

వాసవీకాంపౌండ్‌లో చెత్తాచెదారం




జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు వాసవికాంపౌండ్‌లోని ఖాళీ ప్లాటులో చెత్తాచెదారం పేరుకుపోయి స్థానికులు అసౌకర్యంగా మారింది. ఇళ్ల మధ్యలో దాదాపు 800 చదరపు గజాల ఖాళీ ప్లాటు ఉంది. ఇందులో చెత్తాచెదారం పారవేస్తుండటంతో చిన్నపాటి చెత్తయార్డులా తయారైంది. చెత్త కారణంగా పందులు, ఎలుకలు పెరిగిపోతున్నాయి. పెద్ద పెద్ద ఎలుకలు భూమిలో రంధ్రాలు చేసుకుని పక్క ఇళ్లల్లోకి వెళ్తున్నాయి. వర్షాలు పడితే దుర్వాసన వెదజల్లి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకుపోయిన చెత్త కారణంగా క్రిమికీటకాలు సైతం వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన సుందరకాండ పారాయణం



జడ్చర్ల టౌన్: కావేరమ్మపేట ఈశ్వరస్వామి దేవాలయంలో కొనసాగుతున్న సుందరకాండ పారాయణం మంగళవారం ముగిసింది. పోల వెంకయ్య ఆధ్వర్యంలో దీక్షితుల సుబ్రహ్మణ్య తెలుగు వచనంతో సుందరకాండ పారాయణం చేశారు. పారాయణం వల్ల ప్రాంతంలో గ్రహదోషాలు తొలగి అభయ ఆయురారోగ్యాలు కలుగుతాయన్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సీతారామ లక్ష్మణ, హనుమంతుడి ఉత్సవ విగ్రహాలు ఊరేగించారు. పంచామృత, ఆకుపూజ, 1116 తమలపాకులతో హనుమంతుడికి ఆకుపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పోల రవీందర్, విజయ్, శివ, శ్రీనివాసులు, ఆగిర్ల అశోక్, చెన్నయ్య, వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్‌లు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



రాజాపూర్: మండలంలోని చొక్కంపేట గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీటీసీ సభ్యులు అభిమన్యురెడ్డి చీరలను పంపిణీ చేశారు. గ్రామంలో నిర్వహించనున్న కోటమైసమ్మ బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని మహిళలకు చీరలు అందజేశారు. తమ నాయనమ్మ రేణుకాదేవి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం గ్రామంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్య, సేవ్యానాయక్, నాయకులు అజీమ్, నర్సింహులు, సురేష్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



దమగ్నాపూర్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అందుకు పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదింటి ఆడ బిడ్డల పెళ్లిలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా లక్ష రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల తహసీల్దారులు ఎల్లయ్య, రహిమాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అప్పంపల్లి గ్రామ సింగిల్‌విండో అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, నాయకులు గంజి బాల్‌రాజు, కృష్ణారెడ్డి, సుదర్శన్, శాంతి రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, బోయ నర్సింహులు ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

దేవరకద్ర: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్యే దంపతుల వివాహవార్షికోత్సవం పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. కోయిల్‌సాగర్ మాజీ సర్పంచ్ వెంకటేశ్ ఎమ్మెల్యేను సన్మానించి ప్రత్యేకంగా తయారు చేసిన చిత్రపటాన్ని అందజేశారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు వేయండి



ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

- ఎంపీ డీకే అరుణ
- ఎంపీని కలిసిన బాదేపల్లి అఖిలపక్ష కమిటీ నాయకులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లికి ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు వేయాలని జాతీయ రహదారుల శాఖ అధికారులకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సూచించారు. మంగళవారం సాయంత్రం బాదేపల్లి పట్టణ అఖిలపక్ష కమిటీ, మున్సిపల్ పాలకవర్గం సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో 167వ నంబరు జాతీయరహదారి సమస్యను విన్నవించారు. ప్రస్తుత అంబేడ్కర్ సర్కిల్ మాయం చేసి కల్వకుర్తి చౌరస్తా నుంచి యూటర్న్ తీసుకుని పాత బజార్‌కు వెళ్లేలా రోడ్డు డిజైన్ చేయడాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పాతబజార్ వాసులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని మొరపెట్టుకున్నా రు. ఇప్పటికే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడుతున్నారని, అయితే జాతీయరహదారి కావటం వల్ల ఎంపీ చొరవ తీసు కోవాలని కోరారు. స్పందించిన ఆమె వారిముందే జాతీయరహదారుల శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఊరికి ఇబ్బందులు కలిగేలా ఎలా రోడ్డు డిజైన్ చేస్తారని ప్రశ్నించారు. వెంటనే డిజైన్‌ను మార్చి ఇప్పుడున్నట్లుగానే పాతబజార్‌కు రాకపోకలు సాగించేలా మార్చాలన్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఊరి నుంచి తనవద్దకు ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో వచ్చారని, అలా ఊరికి ఎలా అన్యాయం చేస్తారని నిలదీశారు. విగ్రహాలు తీయటం లేదని, దానివల్ల రోడ్డు పనులు ఆగిపోయినట్లు డీఈ ఆమెకు ఫోన్‌లో వివరించారు. విగ్రహాల తొలగింపు విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించాలన్నారు. రోడ్డు సమస్య మాత్రం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో అఖిలపక్ష నాయకులు సీతారాం, పి.మురళి, హఫీజ్, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేశానికి నెహ్రూ చేసిన సేవలు ఎనలేనివి



మహబూబ్‌నగర్‌లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ నెహ్రూ ప్రధాన మంత్రిగా దేశాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలను రూపొందించినట్లు గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు సాయిబాబా, జిల్లా మైనార్టీ విభా గం అధ్యక్షులు ఎండీ ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, నాయకులు అక్బర్ గులాం జహీర్, నాగరాజు, పీర్ సాధిక్, అంతయ్య, వెంకటలక్ష్మి, అలీం, జగదీష్ పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు చిరస్మరణీయం

జడ్చర్ల: మాజీ ప్రధాని నెహ్రూ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటయ్య తెలిపారు. స్థానిక సిగ్నల్‌గడ్డపై నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, నాయకులు బుక్క వెంకటేశం, రవిశంకర్, లక్ష్మయ్య, మినాజ్, గంగ్య నాయక్, రఘుగౌడ్ పాల్గొన్నారు.



నవాబుపేటలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశానికి నెహ్రూ చేసిన సేవలు మరవలేనివి

నవాబుపేట: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ ఆధ్వర్యంలో నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు భూపాల్‌రెడ్డి, వెంకటయ్య, సత్యం, ఆంజనేయులు, సంతోష్‌నాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలుంటే నేరుగా సంప్రదించండి'



రాజాపూర్: గద్వాల జోగులాంబ జిల్లాలో పనిచేసి రాజాపూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న రాధాకృష్ణ సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి మహ్మదాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామానికి చెందిన వారైనా మ ధ్యవర్తుల ప్రమేయం లేకుండా తమ సమస్యలు నే రుగా తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయవచ్చారు. రాజాపూర్ పరిసర ప్రాంతాల్లో మట్టిని తో డి కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారనే సమాచా రం ఉందని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తిరుమలకు బయలు దేరిన భజనమండలి సభ్యులు

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస భజన మండలి సభ్యులు మంగళవారం తిరుమలకు బయలుదేరివెళ్లారు. తిరుమలలో ఈనెల 29, 30వ తేదీలలో హరినామసంకీర్తన భజన కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. వెళ్లిన వారిలో నాగరాజు, వెంకటయ్య, కృష్ణయ్య, సత్యం, కుశలయ్య, తిరుపతయ్య, శ్రీను, శివ, రవి కుమార్, తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 8 రోజుల జైలుశిక్ష

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది(బంగ్లగడ్డ) గ్రామానికి చెందిన చెన్నరాయుడుకు డ్రంకెన్‌డ్రైవ్‌లో కోర్టు 8రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు. బంగ్లగడ్డకు చెందిన చెన్నరాయుడు ఇటీవల మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ మూసాపేట పోలీసుల తనిఖీలో పట్టుపడ్డాడు. నిందితుడిని మంగళవారం మహబూబ్‌నగర్ కోర్టులో హాజరు పర్చగా జడ్జి 8 రోజుల జైలుశిక్ష విధించడంతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేసుకోవాలి



26వ వార్డులో ప్రొసీడింగ్స్ అందజేస్తున్న వార్డుకౌన్సిలర్, అధికారులు

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం త్వరగా చేసుకోవాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మిస్తే స్టేజీల వారీగా బిల్లులు విడుదల అవుతున్నాయని తెలిపారు. మండలంలోని దేవపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతుందని, వాటికి గాను ఇప్పటికే 10 మంది లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు అందిందని ఆయన వివరించారు. గ్రామాల అధికారులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లు త్వరగా పూర్తి చేసుకునేలా చేయాలని ఆయన వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలను అందజేశారు. 6వ వార్డులో వార్డు కౌన్సిలర్ సుంకసారి రమేష్, వార్డు అధికారి వైష్ణవి, కృష్ణారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాల్‌రాజ్, లక్ష్మయ్య, శాగంటి రఘులు పత్రాలను అందజేశారు. ఇళ్లు పూర్తయ్యే వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 26వ వార్డులో కౌన్సిలర్ ఆలూరి శశికిరణ్, వార్డు అధికారులు శివశంకర్‌రెడ్డి, మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుంగ రఘు, అజ్జులు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. మంజూరు పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ నివాసంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అంతకుముందు రాష్ట్ర మత్స్య శాఖ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీనివాసులు, రజనీకాంత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య



పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ కురుమూర్తి

అడ్డాకుల: విద్యార్థులకు ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాధికారి కురుమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మంగళవారం పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభించారు. మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు వాటిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ వల్ల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ చెన్నయ్య, ఐఆర్‌పీ శివశంకర్, కృష్ణమ్మ, తదితరులు ఉన్నారు.

ప్రాంతీయ శిల్పాకళా వారసత్వాన్ని సంరక్షించాలి

నారాయణపేట రూరల్: ప్రాంతీయ శిల్పకళా వారసత్వాన్ని గుర్తించి సంరక్షించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు డీఐసీజీఎం భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రిసల్యూట్ 4 ఐపి బృందం జిల్లా కేంద్రంలోని సరఫ్ బజార్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హస్తకళ, సాంస్కృతిక ప్రత్యేకతకు పేరుగాంచిన నారాయణపేట 24 క్యారెట్ బంగారం ఆభరణాలు భౌగోళిక సూచిక (జీఐ) రిజిస్ట్రేషన్ కోసం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలుసుకున్న కౌకుంట్ల జెడ్పీహెచ్‌ఎస్ పూర్వవిద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లి సమీపంలో కేకే రిసార్ట్‌లో మంగళ వారం కౌకుంట్ల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ 1992–93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. గురువులు రాంరెడ్డి, జగదీశ్వరయ్య, సురేష్‌బాబు, పూర్వ విద్యార్థులు సి. వెంకటస్వామి, శ్రీకర్, ఊశన్న, మహేందర్, గణేశ్, నాగేశ్, తదితరులు ఉన్నారు.

విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీ



బాలానగర్‌లో విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ లెనిన్‌గౌడ్, ఏఓ అనిల్‌కుమార్



జడ్చర్లలో విత్తన దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

రాజాపూర్(బాలానగర్)/జడ్చర్ల: బాలానగర్ మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో మంగళవారం ఎస్‌ఐ లెనిన్‌గౌడ్, మూసాపేట్ మండల వ్యవసాయశాఖ అధికారి అనిల్‌కుమార్‌లు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు జైలుకు వెళ్లక తప్పదని ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ డీలర్లను హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన, అగ్రికల్చర్‌శాఖ సర్టిఫైడ్ చేసిన విత్తనాలే విక్రయించాలని సూచించారు. ఖచ్చితంగా రైతులు తీసుకున్న విత్తనాలు, ఎరువులకు రశీదు ఇవ్వాలన్నారు. రైతులకు కనిపించే విధంగా స్టాక్‌బోర్డుపై ధరలు రాయాలన్నారు.

- జడ్చర్లలో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని పలు దుకాణాల్లో విత్తన పాకెట్లు, బిల్లులు, స్టాకు, ఇన్వాయిస్, తదితర రికార్డులను పరిశీలించారు. నాసిరకం, అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. తనిఖీలో వ్యవసాయ అధికారులు గోపినాథ్, బ్యూ లా, ఎస్‌ఐ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజీ–3 పత్తి విత్తనాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గోపినాథ్

జడ్చర్ల: బీజీ–3 పత్తి విత్తనాలు సాగు చేయడం అత్యంత ప్రమాదకరమని మండల వ్యవసాయాధికారి గోపినాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నసరుల్లాబాద్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. హెచ్‌టీ(హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలను సాగు చేయడం వల్ల భవిష్యత్‌లో చర్మ వ్యాధులతో పాటు ఇతర ప్రాణాంతకమైన జబ్బుల బారిన పడే ప్రమాదముందన్నారు. పంట భూములు కాలుష్యం బారిన పడి నిస్సారమవుతాయని, ఫలితంగా పంట దిగుబడి గణనీయంగా పడిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. లూజ్ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రైతులు అవగాహన లేక బీజీ–3 విత్తనాలను సాగు చేస్తున్నారని, ఈ విత్తనాలు అత్యంత ప్రమాదకరంగా ప్రభుత్వం నిషేధించిందన్నారు. విత్తనాలు లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను ఎక్కడైనా విక్రయించినట్లు తెలిస్తే విక్రయదారులపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో సాయికుమార్ పాల్గొన్నారు.

రహదారిపై మట్టిని తీస్తున్నారు!

సాక్షి ఎఫెక్ట్..



గుడిబండ స్టేజీ వద్ద హైవేపై మట్టిని తీస్తున్న దాబా హోటళ్ల నిర్వాహకులు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై దాబా హోటళ్లు, పెట్రోల్ పంపులు, టైర్ పంఛర్ల షాపుల వద్ద మట్టి, ఇసుక పేరుకుపోతోంది. దీనివల్ల వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని, ముఖ్యంగా ద్విచక్రవాహన దారులు అదుపు తప్పి కిందపడుతున్నాయి. ఈ నేపథ్యంలో 'రహదారిపై మట్టి.. అదమరిస్తే ప్రమాదం' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి' దినపత్రిలో కథనం ప్రచురితమైంది. దీనికి రహదారి నిర్వాహకులు స్పందించారు. హైవే పక్కన ఉన్న దాబా హోటళ్లు, పెట్రోల్ పంపులు, పంఛర్ షాపుల నిర్వాహకులకు మట్టిని తొలగించాలని ఆదేశాలిచ్చారు. ఎవరి ప్రాంతంలో వారు రోడ్డుపై పేరుకుపోయే మ ట్టిని తొలగించాలని టోల్‌ప్లాజా సిబ్బంది సూచించారు. దీంతో మంగళవారం గుడిబండ స్టేజీ సమీపంలోని కొన్ని దాబా హోటళ్ల నిర్వాహకులు రహదారిపై మట్టిని తీసే పనులు చేపట్టారు. అయితే కాటవరం తండా స్టేజీ సమీపంలోని రాజస్థాన్ దాబా వద్ద మాత్రం మరింత బురద ఏర్పడి వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ముచ్చింతలలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి అన్నారు. ముచ్చింతల గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు గొల్ల చంద్రన్న, లక్ష్మిలు విద్యుత్ ప్రమాదంలో మరణించారు. మన్నెమ్మ, రాంచంద్రయ్యలు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు దశరత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



నారాయణపేట రూరల్: కాళబెళగుందె బనదేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియామవాళి, మహామంగళ హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా పట్టణంలోని యాద్గీర్ రోడ్‌లో గల అయ్యప్ప స్వామి దేవాలయం, శివలింగేశ్వర స్వామి దేవాలయం, మహంకాళి వీధి శివాలయం, మెట్టుగడ్డ ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.